



భక్త జన రథోత్సవం



పెద్ద రథంపై గంగా సమేత శ్రీకాళహస్తీశ్వరుడు. చిన్న రథంపై జ్ఞానప్రసూనాంబ అమ్మవారు. రథాలపై స్వామి, అమ్మవార్ల వైభవాన్ని దర్శించుకునేందుకు మాడవీధుల్లోకి చేరిన భక్తుల శివనామ స్మరణలు. మరోవైపు 'ఓం నమఃశివాయ, హరహర మహాదేవ శంభోశంకరా..' అంటూ పెద్ద రథం మోకులను పట్టి వందలాది మంది భక్తులు లాగడంతో స్వామివారు ముందుకు కదిలారు. ఆ వెనకే 'జై జై కాళి... జై భద్రకాళి' అంటూ అమ్మవారిని స్తుతిస్తూ రథాన్ని లాగారు. ఇలా, స్వామి రథాన్ని అనుసరిస్తూ అమ్మవారూ మరో తేరుపై ముందుకు కదిలారు. మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు శ్రీకాళహస్తిలోని చతుర్మాడ వీధుల్లో మొదలైన రథోత్సవం.. మధ్యాహ్నం 2.30 గంటల వరకు సాగింది. రథాలపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు కింద పడిన ఈ మిరియాలను ప్రసాదంగా తీసుకెళ్లారు. అలాగే, రథాలు ముందుకు కదిలేందుకు మాడవీధుల్లో ఇసుక చల్లారు. మరోవైపు రథాల్లోని ఉత్సవమూర్తులను దర్శించుకునేందుకు ఉదయం 9 గంటల నుంచే వచ్చిన భక్తులతో మాడవీధులు కిక్కిరిశాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభించారు. ఈ రథాలను లాగేందుకు భక్తులు పోటీపడ్డారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
ఉదయం 9 గంటలకు: అధికార నంది, కామధేనువు వాహనసేవ
రాత్రి 10 గంటలకు: శేష, యాళి వాహనసేవ

నేటి రాత్రి శివపార్వతుల కల్యాణం

శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తరువాత గజ వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి బయలుదేరి పెండ్లిమండపం వద్దకు వేంచేస్తారు. శనివారం వేకువజామున స్వామివారి కల్యాణం జరగనుంది. బాల్యవివాహాలు జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.ఈ కల్యాణానికి శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

పరమ పావనం.. లింగోద్భవ దర్శనం

మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం వేకువజామున 4గంటలకు పరమశివుడికి శుద్ధి అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత లింగోద్భవ అభిషేకం చేశారు. ఈ అభిషేకం పూర్తయ్యాక ఉదయం 6 గంటల వరకు భక్తులను లింగోద్భవ దర్శనానికి అనుమతించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని మహాలఘు దర్శనం ఏర్పాటు చేశారు.

- శ్రీకాళహస్తీశ్వర, జ్ఞానప్రసూనాంబ దర్శనం
- జనసంద్రమైన శ్రీకాళహస్తి

లాహిరి.. లాహిరి.. లాహిరిలో..

చుట్టుతా విద్యుద్దీప కాంతులు. బాణసంచా వెలుగులు. పుష్కరిణి చుట్టూ చేరిన భక్తజనం. అందంగా అలంకరించిన తెప్పలపై స్వామి, అమ్మవార్లు. ఇలా మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తిలోని నారద పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషంగా అలంకరించి, చప్పరాలపై బాబుఅగ్రహారంలోని నారద పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. ఓ తెప్పపై స్వామివారు, మరో తెప్పపై అమ్మవారు పుష్కరిణిలో ఐదు ప్రదక్షిణలు చేశారు. ప్రతి ప్రదక్షిణకు అర్చకులు ప్రత్యేక హారతులు సమర్పించి భక్తులకు చూపారు. భక్తులందరూ స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈవో బాపిరెడ్డి, ఉభయదాతలు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





నారద పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తున్న శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ

ఎస్వీయూ దూరవిద్యకు యూజీసీ అనుమతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ దూరవిద్యా విభాగానికి యూజీసీ అనుమతులు మంజూరు చేసింది. 2024-25 విద్యా సంవత్సరానికి దూరవిద్యా విభాగం వివిధ కోర్సులు నిర్వహించుకోవడానికి ఆమోదం లభించింది. యూజీసీ పరిధిలోని డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (డెబ్) 2022 నుంచీ అనుమతులు మంజూరు చేయలేదు. అనుమతులు ఇవ్వాలని యూనివర్సిటీ నుంచీ యూజీసీకి ప్రతిపాదన వెళ్లింది. దీంతో డెబ్ బృందం మూడు రోజుల పాటు దూరవిద్యా విభాగం పరిధిలోని ప్రమాణాలు, వసతులు, కోర్సులు వంటి పలు అంశాలను అధ్యయనం చేసింది. ఈ క్రమంలో ఎస్వీయూ దూరవిద్య పరిధిలో 17 కోర్సుల నిర్వహణకు అనుమతిచ్చింది. దీనిపై ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ అనుమతుల వల్ల దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశానికి కొత్త నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు తెలిపారు.

తెలుగు భాషోన్నతికి పటిష్ట ప్రణాళిక అవసరం

- అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాల్లో వక్తలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషోన్నతికి పటిష్ట ప్రణాళికను రూపొందించాల్సిన అవసరముందని పలువురు పేర్కొన్నారు. తెలుగు అధ్యయన శాఖ- ప్రాచ్య పరిశోధన సంస్థ- బెంగళూరులోని తెలుగు సంపద సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలను గురువారం ఎస్వీయూ సెనేట్ హాల్లో వీసీ అప్పారావు ప్రారంభించారు. సినిమా, మీడియా రంగాల్లో తెలుగుదనం తగ్గి ఆంగ్లత్వం పెరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ సాహిత్య ప్రమాణాలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో తెలుగు రచనలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లె నవల, గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకం ఇందుకు నిదర్శనమన్నారు. తెలుగులో ఇప్పటికీ కథకు ఆదరణ ఉండటం వల్లే వారానికి వందకు పైగా పత్రికల్లో అచ్చవుతున్నాయని తెలిపారు. భాష పరిరక్షణ పట్ల అందరూ ఐక్యంగా ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కృష్ణమూర్తి అన్నారు. బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం మరింతగా పెరగాలని హైదరాబాదులోని కేంద్రీయ విశ్వవిద్యాలయ ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు ఆకాంక్షించారు. తెలుగు ప్రాంతానికి వెలుపల వివిధ కళారూపాలు, సంప్రదాయాలు, ఆచారాల రూపంలో తెలుగు భాష కనిపిస్తోందని తెలుగు భాషా పరిశోధకుడు స.వెం. రమేష్ అన్నారు. మిగతా రాష్ట్రాల్లో.. విదేశాల్లోనూ తెలుగు భాషను కాపాడుతున్నది సామాన్య ప్రజలేనని తెలిపారు. ధారణ శక్తి వల్ల ఎవరైనా చురుగ్గా ఆలోచిస్తారనీ, తెలుగు పద్యాలు ఇటువంటి ధారణకు తోడ్పడతాయని ఎస్కేయూ విశ్రాంతాచార్యుడు శలాక రఘునాథశర్మ పేర్కొన్నారు. మూడు సమాంతర సదస్సుల్లో వివిధ ప్రాంతాల ప్రతినిధులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. సాహిత్య.కామ్ ఆధ్వర్యంలో రచయిత రాసాని పుస్తకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సదస్సు సంచాలకులు ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వేంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ళ మూర్తి, పలువురు తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఆకట్టుకున్న చిత్ర కళా ప్రదర్శన

అన్నమయ్య భవన్‌లో 30 మంది చిత్రకారులు, 100 చిత్రాలను ప్రదర్శించారు. ఎన్.యుగేష్, పి.మోహనప్రియ, ఆలూరు రమాదేవి, బత్తుల అర్చన రూపొందించిన చిత్రాలు ఈ ప్రదర్శనలో కొలువుతీరాయి.

నిమిషం ఆలస్యమైనా అనుమతిలేదు

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 86 కేంద్రాలు.. 62,761 మంది విద్యార్థులు
- సమస్యలుంటే 0877 2237200కు ఫోను చేయండి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు. ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రం వద్దకు చేరుకోవాలి' అని అధికారులు స్పష్టం చేస్తున్నారు. శనివారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు సమయ పాలన ముఖ్యమని చెబుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జనరల్, ఒకేషనల్ కలుపుకొని 32,213 మంది ఇంటర్ ప్రథమ.. 30,548 మంది ద్వితీయ సంవత్సరం కలుపుకొని.. మొత్తం 62,761 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరికి 86 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలోనూ 16కు తక్కువ కాకుండా.. మొత్తం 1,376 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటిని అమరావతిలో ఇంటర్ విద్యామండలి కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. దీంతో రాజధానిలోని బోర్డు అధికారులూ జిల్లాలో పరీక్షలను పర్యవేక్షించే అవకాశం ఉంది. ఇక, సమస్యాత్మక కేంద్రాలైన పిచ్చాటూరు, నాగలాపురంలలో పోలీసు భద్రత, విద్యాశాఖ సిబ్బంది, సీసీ కెమెరాల ఏర్పాట్లను పటిష్టం చేశారు. అలాగే, పోలీసు, రెవెన్యూ, అధ్యాపకులు, డీఈసీ మెంబర్లతో నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లతో పాటు 8 సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. అన్ని కేంద్రాలవద్ద 144 సెక్షన్. విద్యార్థుల రాకపోకలకు ఆర్టీసీ సౌకర్యం, నిరంతర విద్యుత్తు సరఫరా, వైద్య సహాయ బృందాలను అందుబాటులో ఉంచనున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు: తిరుపతి అన్నమయ్య కూడలి సమీపంలోని ఆర్ఐవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమస్యలు,ఫిర్యాదులు, సమాచారం కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు 0877 2237200 నెంబరులో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు.

హాజరు తక్కువకు అపరాధం లేదు : హాజరు శాతం తక్కువైన విద్యార్థుల నుంచి గత వైసీపీ ప్రభుత్వం అపరాధ రుసుం వసూలు చేసేది. హాల్‌టికెట్లను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో తక్కువైన హాజరు శాతాన్నిబట్టి రూ.1000 నుంచి రూ. 1500 వసూలు చేసేవారు కూటమి అధికారంలోకి వచ్చాక విద్యార్థులకు అలాంటి ఆర్థిక భారం లేకుండా చేసింది. హాజరు తక్కువైనా పైసా చెల్లించకుండా ఆన్‌లైన్‌లో గాని, మన మిత్ర (వాట్సప్ గవర్నెన్స్) ద్వారాగాని విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పటిష్ఠంగా ఏర్పాట్లు చేశాం



ప్రశాంతంగా, ఎటువంటి అవకతవకలు లేకుండా పరీక్షలను నిర్వహించేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో చర్యలు తీసుకున్నాం. విద్యార్థులకు అవసరమైన రవాణా, వైద్య, విద్యుత్, తాగునీరు తదితర అన్ని ఏర్పాట్లు చేశాము. ఇప్పటికే జిల్లాకు చేరిన ప్రశ్నపత్రాలను 24 పోలీస్ స్టేషన్లలో భద్రపరిచాం. 245 మంది ప్రత్యేక ప్రతిభావంతులైన విద్యార్థులకు.. సహాయకులను అనుమతిచ్చాం. నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉండదు. విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. ఎవరైనా కాపీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

- జీవీ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి

■ నేడు నేషనల్ సైన్స్ డే

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని కలిగించి... పరిశోధనాత్మక జ్ఞానాన్ని పెంపొందించి... వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ - మనక్ ప్రదర్శనా పోటీలను నిర్వహిస్తోంది. తాజాగా మన జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు ఎంపికైన పరిశోధనా విశేషాలు...

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

మన బుల్లి శాస్త్రవేత్తలు



జపాన్‌ను మెప్పించిన బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్



ఉడికిన తర్వాత కోడిగుడ్డు పెంకును తొలగించేందుకు అవస్థలు పడుతుంటాం. దీనికో సులభ యంత్రం కనిపెట్టింది రేణిగుంట మండలం, గుత్తివారిపల్లె జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని గొల్లపల్లి రేష్మ. గుండ్రంగా తిరుగుతున్న బౌల్‌లోకి ఉడికించిన గుడ్లు వేయగానే పెంకులు ఒకవైపునకు, కోడిగుడ్లు మరో వైపునకు చేరతాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేవారి పనిని ఇది తేలిక చేస్తుంది. హోటళ్లు, ఆస్పత్రుల్లో ఈ పరికరం చాలా ఉపయుక్తంగా ఉంటుంది. టీచర్ పి. మునిరెడ్డి మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు. బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, అక్కడ కూడా ఉత్తమ ప్రాజెక్టులలో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శితమైంది.

టెంకాయలు కొట్టే యంత్రం

టెంకాయలకు తేలికగా రంధ్రాలు వేయడం, ఎంతగట్టిగా ఉన్న సులభంగా పగులగొట్టడం.. ఈ పరికరం చేస్తుంది. రామచంద్రాపురం మండలం, కమ్మపల్లి జీహెచ్ఎస్ విద్యార్థిని ఎం. వాణి రూపొందించిన యంత్రం ఇది. టీచర్ ఎస్‌జే కామేశ్వరి సహకారంతో ఈ ప్రాజెక్టను తయారు చేశారు.



చెత్త శుభ్రతకు యంత్రం

కాలువల్లోని చెత్తాచెదారాలను సులభంగా శుభ్రం చేసేందుకు తయారు చేసిన యంత్రం ఇది. నగరాల్లో డ్రైనేజీ కాలువలు శుభ్రంచేసే పనివారికి చాలా ఉపయోగపడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేసేందుకు దోహద పడుతుంది. దొరవారిసత్రం మండలం, కల్లూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వి. నిరూష దీనిని రూపొందించారు. ఇది జాతీయస్థాయి ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. టీచర్ పీవీ రమణయ్య మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు.



స్వయం ఉపాధి కోసం

మేదర, కుమ్మరిలు దరఖాస్తు చేసుకోండి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలంలో బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి స్వయం ఉపాధి పథకం ద్వారా గ్రూపులోను పొందేందుకు అర్హులైన మేదర, కుమ్మరి/శాలివాహన కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో రామచంద్ర కోరారు. గ్రూపులో 3 నుంచి 5గురు సభ్యులు ఉండి 21 నుంచి 60ఏళ్లలోపు వయసు కలిగిన వారు మాత్రమే అర్హులని తెలిపారు. 24 యూనిట్లు ఉన్నాయని తెలియజేశారు. మొత్తం విలువ రూ.24లక్షలని వివరించారు. ఇందులో రూ.12లక్షల సబ్సిడీ ఉంటుందని వివరించారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎండోమెంట్ బహుమతికి విరాళం



పాకాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎండోమెంట్ బహుమతి కోసం రూ.20వేలు ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ రమేష్‌కుమార్ తల్లిదండ్రులు విజయలక్ష్మీ, వెంక టేశులు గురువారం అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషాకు అంద జేశారు. ఆంగ్ల సబ్జెక్ట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ప్రతి ఏటా దీనిపై వచ్చే వడ్డీ బహుమతిగా ఇవ్వాలని కోరారు.

కబడ్డీ విజేత పుంగనూరు



పాకాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామలచెరువులో గౌరీ బోర్ వెల్స్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో వివిధ ప్రాంతాలకు చెందిన 15 జట్లు పాల్గొన్నాయి. పుంగనూరుకు చెందిన జట్టు విజేతగా నిలిచింది. దామల చెరువు రన్నర్స్‌గా నిలిచింది. విజేతకు రూ.15వేలు నగదు, ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.7000 నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ సంజీవరాయులు, నిర్వాహకులు సూర్య, శివాజీ స్థానికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ సిద్ధమునియాదవ్

చంద్రగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తొండవాడ పంచాయతీ మాజీ సర్పంచ్ బగాది సిద్ధమునియాదవ్(70) గురువారం గుండె పోటుతో మృతిచెందాడు. ఉదయం అల్పాహారం తీసుకుని కొంత సేపటికే ఆయన గుండెపోటుకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే చంద్రగిరి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పార్టీలకు అతీతంగా పలువురు నాయకులు, గ్రామస్థులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మరకత శక్తి కాళీ అమ్మవారి సేవలో మంత్రి తుమ్మల



రామచంద్రాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): రాయలచెరువు కట్ట శక్తి పీఠంలో వెలిసిన మరకతశక్తి కాళీ అమ్మవారిని తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. పీఠం నిర్వాహకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పిం చారు. తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదిం చారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి, శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతిస్వామినిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో పీఠం కార్యదర్శి శ్రీకాంత్, ఆయ ప్రధాన అర్చకులు శశిభూషణ్ పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేకి సహకరించండి



ఎంపీడీవో రామచంద్ర

తిరుపతిరూరల్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): మండలంలో సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి చేపడుతున్న వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వేకి అందరూ సహకరించాలని దీనిపై ఎలాంటి అపోహలు అక్కర్లేదని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్-2047లో భాగంగా పలురకాల సర్వేలు నిర్వహిస్తోంద న్నారు. అందులో భాగంగా ప్రస్తుతం వర్క్‌ఫ్రమ్ హోమ్ అనే కాన్సెప్ట్ కింద పనిచేసే 18-50 సంవత్సరాలలోపు ఉన్న పురుషుల, స్త్రీల వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు. ఈసర్వే ద్వారా పనిచేసే పరిసరాల్లో, ఇంటివద్ద ఎలాంటి సౌకర్యాలు అవసరమో గుర్తిస్తారని తెలిపారు. ఇంటర్నెట్ సదుపాయం, ఇంట్లో పనిచేసుకునే వసతులు (గదులు వంటివి), నైపుణ్యతతో కూడిన వసతులు ఏర్పాటు, ఒక ఏరియాలో ఎక్కువ మంది ఉన్నట్లయితే అందరికీ కలిపి ఒక హాలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై గ్రామస్థాయిలో సర్వేచేస్తున్నట్లు వివరించారు. వచ్చేనెల 10వ తేదీలోపు సర్వే పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఉగ్రప్రత్యంగిర హోమం

చంద్రగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తొండవాడ సమీపంలోని ఉగ్ర ప్రత్యంగి రాలయంలో గురువారం ఉగ్రప్రత్యంగిర హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉగ్రప్రత్యంగిర కాళిపీఠం వార్షికోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు ఆలయం లోని అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి ప్రత్యంగిరహోమం, కాలభైరవ హోమం వైభవంగా నిర్వ హించారు. దశమహావిద్య హోమం చేసి, నైవేద్యం, మంత్ర పుష్పం, హారతి, తీర్థ ప్రసాద వినియో గం నిర్వహించారు. పీఠాధిపతి పూజారి సూరిస్వామి, వేదపండితులు సీతారామశర్మ, కార్య నిర్వా హకులు పూజారి శివశంకర ప్రసాద్, వడికాసుల రామమూర్తినాయుడు, భక్తులు పాల్గొన్నారు.

కోర్టు కాంప్లెక్సు స్థలాన్ని పరిశీలించిన న్యాయమూర్తులు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామ పంచాయతీ దామినేడు రెవెన్యూ లెక్క దాఖలాలో జిల్లా కోర్టు భవన సముదాయానికి కేటాయించిన రూ.14.40 ఎకరాల స్థలాన్ని గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రఘునందనరావు, పలువురు న్యాయమూర్తులు, జేసీ శుభం బన్సల్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. దీనికి సంబంధించి జిల్లా యంత్రాంగం రికార్డులను సిద్ధం చేసి న్యాయమూర్తులకు అందజేసినట్లు సమాచారం. మరో నెల రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

3న గ్రీన్ హైడ్రోజన్ యూనిట్ ప్రారంభం

- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న సీఎం

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం పాగాలి గ్రామంలో హీరో గ్రూప్స్ నిర్మించిన గ్రీన్ హైడ్రోజన్ యూనిట్‌ను మార్చి 3న అమరావతి నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ టెలీ కాన్ఫరెన్సు ద్వారా సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు.

నేడు పేట తిరుణాళ్ల

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్ర వారం నెరబైలు పేటలో తిరుణాళ్ల జరగ నుంది. తలకోనలో మహా శివరాత్రి తర్వాత మూడవ రోజు నెరబైలులో తిరుణాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలోనే తిరుణాళ్ల జరగనుంది. తలకోనకు వచ్చిన అంగళ్లు వేసి వారందరూ నెరబైలులో దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. దీంతో నెరబైలులో సందడి నెలకొంది.

సిద్ధపూజోత్సవంలో ఈవో అలక!

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తలకోనలో జరిగిన సిద్ధపూజ కార్యక్రమంలో ఈవో రవీంద్రరాజు అలక పూనినట్లు తెలి సింది. ఈ సిద్ధ పూజోత్సవంలో స్థానికులు, అర్చకులు, మీరాశిదారులు, వరపడిన భక్తులు పాల్గొంటారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసి తిరిగి ఈవోగా రవీంద్రరాజు పది రోజుల కిందట వచ్చారు. సిద్ధ పూజోత్స వంలో ఈవో మాటలు అమలు కాకపోవ డంతో ఆయన అలకబూనినట్లు తెలిసింది. సిద్ధపూజకు దేవదాయ హారతి ఇవ్వడం, కొబ్బరికాయను కొట్టడం సంప్రదాయం ప్రకారం ఈవోనే మొదట చేపట్టాలి. కానీ ప్రస్తుతం జరిగిన సిద్ధ పూజలో ఈవో అలిగి హారతి ఇవ్వలేదని, టెంకాయ కొట్టలేదని సమాచారం. భక్తుల ముందే పాలక మండలి, దేవదాయ అధికారులు, అర్చకుల మధ్య సమన్వయం, సఖ్యత లేకపోవడం కనిపించింది. ఇక్కడి పరిస్థితులను ఉన్నతా ధికారులు చక్కదిద్దాలని భక్తులు కోరుతున్నారు.

సచివాలయంలో ప్రింటర్ చోరీ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి27 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిరూరల్ మండలం మల్లం గుంట గ్రామపంచాయతీలోని సచివాల యంలో దొంగలు పడ్డారు. దాదాపు రూ.15 వేల విలువచేసే ప్రింటర్‌ని ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పంచాయతీ కార్యదర్శి సి.బాలసుబ్రమణ్యం రెడ్డి కథనం మేరకు.. మంగళవారం సాయం త్రం విధులు ముగించుకుని ఇంటికెళ్లే ట ప్పుడు ప్రింటర్ ఉంది. బుధవారం మహాశివ రాత్రి సెలవుని పురస్కరించుకుని ఉద్యోగులు విధులు హాజరుకాలేదు. గురువారం వచ్చి చూడగా ప్రింటర్ కనిపించలేదు. ఎంపీడీవో సూచన మేరకు ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇదే సచివాలయం లో గతేడాది జూన్‌నెలలో కంప్యూటర్లు, సీపీయూ, ప్రింటర్లు చోరీకి గురయ్యాయి. ప్రస్తుతం మళ్లీ చోరీ జరగడం గమనార్హం.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు

ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని వివిధ శివాలయాలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగి శాయి. బోడేవాండ్లపల్లె శివాలయం, నెరబైలు పంచాయతీలోని గుడిమిట్ట శివాల యం, ఉదయమాణిక్యంలోని శివాలయాల్లో బుధవారం రాత్రి భక్తులు జాగరణ చేశారు. గురువారం అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు చేశారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

చంద్రగిరి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలో ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభను శుక్రవారం 10 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురు వారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లె క్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

- మంగళవారం నాటి హుండీ ఆదాయం: రూ.2.92 కోట్లు
- బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 62,323
- తలనీలాలు సమర్పించినవారు: 20,460

భక్తిశ్రద్ధలతో సిద్ధపూజ

తలకోనలో ముగిసిన శివరాత్రి వేడుకలు



ఎర్రావారిపాళెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆదిదంపతుల కళ్యాణోత్సవం జరిగిన మరుసటి రోజు సిద్ధపూజోత్సవం క్రతువుతో ఉత్సవాలు ముగియడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆలయ సంప్రదాయం ప్రకారం ఐదవ రోజు సిద్ధ పూజోత్సవానికి సిద్ధులు తయారు చేసిన సిద్ధప్రసాదాన్ని సిద్ధమండపంలో ఆది దంపతుల ఎదుట ఉంచారు. జంగమ దేవరులు శంఖం పూరించి దేవతలకు ఆహ్వానం పలికారు. యాదవ వంశస్తులు లోక కళ్యాణం కోసం జంగమ దేవుని ఆరాధిస్తూ కీర్తించారు. శంఖానాదంతో తలకోన గిరులు పులకరించాయి. సంతాన కోసం వరపడిన మహిళా భక్తులకు సిద్ధప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమనాథరెడ్డి, ఈఓ రవీంద్రరాజు, పాలక మండలి సభ్యులు గురుప్రసాద్, రాజన్న, చలపతి, శివకుమార్, గుర్రప్పనాయుడు, మేడా శ్రీనాథ్, చంద్ర, శిరివేలు రమేష్, కూటమి నాయకులు మహేష్‌నాయుడు, దేశిరెడ్డి గోపి, అశోక్‌రెడ్డి, చిన్నపరెడ్డి, కేశవులనాయుడు, జయపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, మురళి, హరిశ్చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవతల రాక..!

తలకోన స్థల పురాణ ప్రకారం ఆది దంపతుల కల్యాణోత్సవం జరిగిన మరుసటి రోజు సిద్ధపూజ పూర్తయ్యాక దివి నుంచి దేవాది గణాలు స్వయంగా వచ్చి ఉత్సవాల తీరును తిలకిస్తారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ క్రమంలో సిద్ధపూజ ముగియడంతో శుక్రవారం దేవతలతా విచ్చేసి ఉత్సవాల తీరును తిలకించనున్నారని గురువారం రాత్రి తలకోనలో భక్త జనసంచారం ఉండదు.

కమనీయం ఆది దంపతుల కల్యాణం





ముక్కోటిలో స్వామివారికి నిర్వహిస్తున్న కల్యాణోత్సవం, హాజరైన భక్తులు

చంద్రగిరి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణ ముఖినది తీరాన వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం శివపార్వతుల కల్యాణం కనుల పండువుగా జరిగింది. మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయంలో గురువారం ఉదయాత్పూర్వం 3 గంటలకు లింగోద్భవ అభిషేకాన్ని నిర్వ హించి భక్తులకు దర్శనం క ల్పించారు. 11.30 గంటలకు అన్నదానం చేశారు. సాయంత్రం 5 గంటలకు ఆలయ ఆవరణలోని నటరాజ కల్యాణ మండపంలో పార్వతీ పరమేశ్వర్ల ఉత్సవర్లను అధిష్ఠించి మంగళవాయిద్యాలు, మేళతాళాలు, వేద మంత్రోచ్చరణల నడుమ స్వామివారి కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ, దీపారాధన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మ కర్త మొగిలి రఘునాథరెడ్డి, గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు స్వామివా రికి అభిషేకం చేసి సిద్ధపూజ నిర్వహించారు. 11.30 గంటలకు భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6 గంటలకు సామూహిక కల్యాణోత్సవం, ప్రాకారో త్సవం, ఊంజల్ సేవ, శయనోత్సవం, పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ మొక్కల వెంకటరమణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



9 నుంచి తెప్పోత్సవాలు

ఏర్పాట్లపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మార్చి 9 నుంచి 13 వరకు జరుగనున్న శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాల ఏర్పాట్లను టీటీడీ వేగవంతం చేసింది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి గురు వారం తిరుమలలోని అన్నమయ్య భవ నంలో వివిధ విభాగాల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. తెప్పోత్సవాల నేపథ్యంలో 9, 10వ తేదీల్లో సహస్రదీపా లంకార సేవ, 11,12,13వ తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ లను టీటీడీ రద్దు చేసింది. అలాగే, మార్చి నెలలో 26న అన్నమాచార్య వర్ధంతి, 30వ తేదీ ఉగాది ఆస్థానం జరుగనుంది. వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై కూడా అదనపు ఈవో సమీక్షించారు.

తెప్పోత్సవాలు ఇలా..

ప్రతి రోజు రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య తెప్పోత్సవాలను నిర్వహించను న్నారు. తొలిరోజు సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా శ్రీరామచంద్రమూర్తి తెప్పపై కొలువుదీరి పుష్కరిణిలో మూడుచుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేస్తారు. రెండవరోజు రుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామి మూడుసార్లు విహరిస్తారు. మూడవరోజు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి మూడుసార్లు, నాల్గో రోజు ఐదు సార్లు, చివరిరోజు ఏడుసార్లు తెప్పపై విహరించి భక్తులను కటాక్షిస్తారు.

14న కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మార్చి14న కుమారధార తీర్థ ముక్కోటి జరుగనుంది. ప్రకృతి సౌందర్యాల నడుమ కుమారధార తీర్థంలో స్నానమాచరించడాన్ని భక్తులు ప్రత్యేకంగా భావి స్తారు. వృద్ధాప్యంలో ఒక బ్రాహ్మణుడు అడవిలో సంచరిస్తూ ఈ తీర్థంలో స్నానమాచరించగానే ముసలి వయస్సు నుంచి కౌమార్యంలోకి మారిపో వడం వల్ల ఈ తీర్థానికి కుమారధార అనే పేరు వచ్చిందని ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. కాగా కుమారధార తీర్థ ముక్కోటి ఏర్పాట్లపై టీటీడీ అద నపు ఈవో వెంకయ్య చౌదరి గురువారం తిరుమల లోని అన్నమయ్య భవనంలో అధికారులతో సమీక్షిం చారు. 14వ తేదీ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే భక్తులను కుమారధార తీర్థా నికి అనుమతిస్తామని స్పష్టం చేశారు. అధికబరువు, ఆస్తమా, గుండె సంబంధిత సమస్యలు, ఇతర దీర్ఘకా లిక వ్యాధులు ఉన్నవారు, చిన్నపిల్లలు, వృద్ధులు అట వీమార్గంలోని ఈతీర్థానికి నడిచి వెళ్లడానికి అనుమ తించబోమన్నారు.

కనులపండువగా కపిలేశ్వరుడి కల్యాణం

పురుషామృగ వాహనంపై సోమస్కందమూర్తి ఊరేగింపు





కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

తిరుపతి(కపిలతీర్థం), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కపిలతీర్థంలో వెలసిన కపిలేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం రాత్రి కనుల పండువగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం కామాక్షి సమేత సోమస్కందమూర్తి పురుషామృగ వాహనంపై ఊరేగుతూ దర్శనమిచ్చారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. కాగా శివరాత్రి రోజు అర్ధరాత్రి 12 నుంచి 4 గంటల వరకు లింగోద్భవకాల అభిషేకం నిర్వహించారు. ఉదయం సుప్రభాతం అనంతరం స్వామివారికి అభిషేకం జరిపి ప్రత్యేకంగా అలంకరించి ఉదయం 8 గంటలకు సర్వదర్శనం ప్రారంభించారు. 11 గంటలకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ప్రధానార్చకులు మణివాసన్ గురుకుల్, అర్చకులు శాస్త్రోక్తంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. అనంతరం తిరుచ్చిపై స్వామివారు పురవీధుల్లో విహరించారు. ఆలయం ముందు ఎస్వీ మ్యూజిక్ అండ్ డాన్స్ కళాశాల ఆధ్వర్యంలో వేణుగానలహరిలో శివనామ సంకీర్తన, పుత్తూరుకు చెందిన లాస్య తరంగణి నృత్యాలయ విద్యార్థులు భరతనాట్య కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- నేడు త్రిశూల స్నానం..సూర్యప్రభ వాహనం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం త్రిశూలస్నానం, నటరాజస్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగుతారు. సాయంత్రం ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. రాత్రి రావణాసుర వాహనసేవ జరుగుతుంది.

సీవోసీ పనులు త్వరగా పూర్తి చేయండి

తిరుపతి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ (సీవోసీ) నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. పాత మునిసిపల్ కార్యాలయ స్థానంలో స్మార్ట్ సిటీ నిధులతో గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్థులలో నిర్మిస్తున్న సిటీ ఆపరేషన్ సెంటర్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి ఆమె గురువారం పరిశీలించారు. ప్లాన్‌ను పరిశీలించి పలు మార్పులను సూచించారు. నగరానికే తలమానికంగా నిర్మిస్తున్న ఈ భవన నిర్మాణ పనులు గడువు లోపు పూర్తి చేయాలన్నారు. కార్యాలయంలోని అందరు విభాగాధిపతులకు గదులు ఉండేలా చూడాలన్నారు. కౌన్సిల్ హాల్ ప్రత్యేకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. కింది భాగంలో పార్కింగ్‌కు ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈఈ రవి, ఏఈకాం ప్రతినిధులు బాలాజీ, అనిల్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు అన్నారు.

జాతీయ క్రీడల్లో ఎస్పీడబ్ల్యూ విద్యార్థినుల సత్తా

తిరుపతి (క్రీడలు), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి క్రీడల్లో సత్తాచాటారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్.కుమార్ విద్యార్థినులు టి.సాయి, వై.గంగాభవాని, ఎస్.ధరణి, ఆర్.లక్ష్మీలావణ్య, కె.రెడ్డిజీవన, ఈ.సౌమ్య, ఎం.లిఖిత, ఎస్.అమ్రిన్, ఎం.రేవతి, వి.మోక్షలకు ప్రశంసాపత్రాలు అందించి, అభినందించారు. వీరికి శిక్షణ ఇచ్చిన కోచ్ సాయిసుమతిని కూడా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి, ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎస్.సురేష్, నెల్లూరు వ్యాయామ ఉపాధ్యాయుడు జి.ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ గడువు పెంపు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువును మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1 నుంచి మే 31వ తేదీ వరకు పొడిగిస్తున్నామని, సంబంధిత మీడియా సంస్థల యాజమాన్యాలు వారి వద్ద పనిచేస్తున్న జర్నలిస్టుల వివరాలను తిరుపతి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వీలైనంత త్వరగా అందజేయాలని కోరారు.

ఆర్టీసీ కార్మికులకు దుస్తుల పంపిణీ

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంస్థ రిటైర్డ్ ఉద్యోగి కె.ఎన్.చెంగల్రాయులు గురువారం దుస్తులు(చీరలు, షర్టు, ప్యాంటు) పంపిణీ చేశారు. సీబీఎస్‌లో కంట్రోలర్‌గా పనిచేసి, ఉద్యోగ విరమణ చేసిన ఆయన్ను బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, ఈ.ఆర్.కుమార్, సహచర ఉద్యోగులు సన్మానించారు. కార్మికులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల నమోదు

తిరుపతి(ఆర్టీసీ), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సెంట్రల్ బస్టాండులో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు ఈ-శ్రమ్ పోర్టల్ ఉచిత నమోదు ప్రక్రియ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఎం.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో చేరిన వారికి 12 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు(యూనివర్సల్ ఐడెంటిఫికేషన్ నంబరు) మంజూరు చేస్తామన్నారు. అన్ని రకాల సామాజిక, సంక్షేమ పథకాలు దీని ద్వారానే వర్తిస్తాయని తెలిపారు. ప్రతి కార్మికుడూ పోర్టల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు, కంట్రోలర్ ఈ.ఆర్.కుమార్, లేబర్ అసిస్టెంట్ కమిషనర్లు చిన్నలాలప్ప, జైశ్రీమన్నారాయణ, రాజయ్య పాల్గొన్నారు.

ప్రాణదాన పథకానికి 142 మంది ఎంపిక

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో టీటీడీ ప్రాణదాన పథకంలో భాగంగా పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్స నిర్వహించేందుకు అర్హులైన 142 మంది రోగులను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. స్విమ్స్‌లోని డైరెక్టర్ కార్యాలయ కమిటీ హాల్లో గురువారం డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. అర్హులైన రోగుల వివరాలను పరిశీలించి విభాగాల వారీగా 142 మందిని ఎంపిక చేశారు. మెడిసన్ 24, ఈఎన్‌టీ 1, గైనకాలజీ 1, జనరల్ సర్జరీ 5, కార్డియాలజీ 3, న్యూరోసర్జరీ 15, కార్డియో థొరాసిక్ 12, మెడికల్ అంకాలజీ 3, నెఫ్రాలజీ 44, న్యూరాలజీ 18, గ్యాస్ట్రో ఎంట్రాలజీ 14, సర్జికల్ అంకాలజీ 2 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో కోటిరెడ్డి, టీటీడీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఏబీ నర్మద, వైద్యాధికారులు శ్రీనివాస్, ప్రసన్నరాగూర్, సత్యవతి, రాజశేఖర్ పాల్గొన్నారు.

తిరుపతిలో అగ్నిప్రమాదం

రూ.15 లక్షల నష్టం



తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అన్నమయ్య సర్కిల్ సమీపంలోని నేచురల్స్ బ్యూటీ పార్లర్‌లో గురువారం రాత్రి అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాదాపు రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. అగ్నిమాపకశాఖ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. రెండో అంతస్తులో గిరిధర్‌కు చెందిన ఈ బ్యూటీ పార్లర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల భవనాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.15 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా.

తిరుపతి

పట్టించుకోండి సారూ..

రోడ్డుపైనే మురికినీరు..చెత్త



నగరపరిధిలోని కరకంబాడిరోడ్డులో(భూపాల్ హౌసింగ్ కాలనీ ముందు) మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. భూపాల్ హౌసింగ్ కాలనీ నుంచి వచ్చే పెద్దకాలువ పూర్తిగా చెత్తాచెదారంతో నిండి ఉండటంతో కాలువ నిండి రోడ్డుపైకి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పరిష్కరించాల్సి ఉంది.

– తిరుపతి జీవకోన, (ఆంధ్రజ్యోతి)

శ్మశానానికి దారేది?

ఆక్రమించేశారంటూ కొరమేనుగుంట వాసుల ఆవేదన



శ్మశానానికి దారి లేకుండా నిర్మించిన రేకుల షెడ్డు

తిరుపతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : "కొరమేనుగుంటకు చెందిన ఓ మాజీ సైనికుడు గురువారం మృతిచెందారు. కూతవేటు దూరంలో ఉండే శ్మశానానికి దారి లేకపోవడంతో అంత్యక్రియల కోసం భౌతిక కాయాన్ని గ్రామస్తులు గోవిందధామానికి తీసుకెళ్లాల్సి వచ్చింది" తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్డు పుణ్యమా అంటూ శ్మశానానికి దారిలేకుండా చేశారని ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు. వివరాలను పరిశీలిస్తే.. తిరుపతి అర్బన్ మండలం సర్వే నెంబరు 53, 54లలోని స్థలాన్ని ఎన్నో ఏళ్లుగా కొరమేనుగుంట ప్రాంతవాసులు శ్మశానానికి వినియోగిస్తున్నారు. అయితే ఆ ప్రాంతంలో ఇటీవల వచ్చిన ఓ మాస్టర్ ప్లాన్ రోడ్డు వలన కొందరు కబ్జాదారుల కన్ను శ్మశానంపై పడింది. ఇటీవల దారిలేకుండా గోడ కట్టేయడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు. ఇటీవల ఆ ప్రాంతంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఏకరవుపెట్టారు. ఆ తర్వాత అనేకసార్లు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. న్యాయం చేస్తామని హామీలు ఇస్తున్నారు కానీ క్షేత్రస్థాయిలోకి వచ్చి సమస్యను పరిష్కరించడంలేదు. ఇంతలో గోడ కట్టిన చోట రేకులతో చిన్న గదిని కూడా నిర్మించేశారు. గతంలో దళితులకిచ్చిన పట్టాలు ఉండాయని, అందుకే తాము అక్కడ కట్టుకుంటున్నామని వారు చెబుతున్నారని తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

● పరిశీలించి చర్యలు తీసుకుంటాం: భాగ్యలక్ష్మి, అర్బన్ తహసీల్దార్

కొరమేనుగుంట శ్మశానవాటిక ఆక్రమణ జరిగిందంటూ ఫిర్యాదు వచ్చింది. ఆ స్థలం తమకిచ్చారంటూ కొందరు పట్టాలు చూపిస్తున్నారు. పరిశీలించమని అధికారులకు చెప్పాం. అది శ్మశానానికి సంబంధించిన స్థలమే అయితే రేకుల షెడ్డును తొలగించి దారి కల్పిస్తాం.

న్యాయం చేసే వరకు పోరాటం

ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు



వర్సిటీ ప్రధాన గేటు ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచి న్యాయం చేయాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు కోరారు. వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో బైఠాయించి గురువారమూ సమ్మెను కొనసాగించారు. విద్యార్థులు మాట్లాడుతూ 13ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్న ఆశతో 25 రోజులుగా దీక్ష చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు తమ గోడును ఆలకించి న్యాయం చేయాలని కోరారు.

సాంకేతికతపై రైతులకు అవగాహన



తిరుపతి నుంచి బయలుదేరుతున్న రైతులు

తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగులో వస్తున్న నూతన సాంకేతికతపై రైతులకు అవగాహన అవసరమని రాస్ కేవీకే సీనియర్ శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసులు పేర్కొన్నారు. భారత ఉద్యాన పరిశోధన సంస్థ బెంగళూరు వారు నిర్వహిస్తున్న రైతుల విజ్ఞాన యాత్రకు తిరుపతి రాస్ కేవీకే నుంచి 22 మందిని పంపారు. ఆ వాహనాలను శ్రీనివాసులు తిరుపతి రాస్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ యాత్ర వల్ల అధిక దిగుబడి సాధించే అంశాలపై అవగాహన చేసుకోవడానికి అవకాశముందన్నారు. సాంకేతికతను పెంచుకోవడం వల్ల కొత్త వంగడాలతో పాటు కూరగాయలు, పండ్లు, పూలు పండించే అవకాశముందని పేర్కొన్నారు. రైతులతోపాటు శాస్త్రవేత్తలు రామ్‌కుమార్, సుధాకర్ వెళ్లారు.

దారి సమస్య పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్లు మునికృష్ణ, ముద్రనారాయణ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని శివజ్యోతినగర్ ఎస్వీఎస్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ దగ్గర దారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. దారి సమస్యను స్థానికులు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా వేలాది మంది ఈ దారిగుండానే జీవకోన ప్రాంతంలోకి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. దీంతో కమిషనర్ గురువారం శివజ్యోతినగర్‌లో పర్యటించి సమస్య గురించి తెలుసుకున్నారు. సమస్య కోర్టులో ఉన్నందున సహకరించాలని, పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, జనసేన కార్పొరేటర్ ఎస్‌కే.బాబు, డీసీపీ మహాపాత్ర, స్థానిక టీడీపీ నాయకులు సుజాతచౌదరి, లోకనాథం యాదవ్ పాల్గొన్నారు.

జీవాల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

వెటర్నరీ ఇన్‌చార్జి వీసీ రమణ



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ రమణ, పక్కనే అధికారులు శ్రీలత, శోభామణి

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో జీవాల(గొర్రెలు, మేకలు)పెంపకాన్ని చేపట్టడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ తెలిపారు. వర్సిటీలోని నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో ఐసీఏఆర్-నార్మ్ ఆర్థిక సౌజన్యంతో లాభసాటిగా గొర్రెల, మేకల పెంపకం అనే అంశంపై నిర్వహించిన మూడ్రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు జీవాల పెంపకంలో సరైన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు సాధించలేక నష్ట పోతున్నారన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని, శాస్త్రీయ పరిజ్ఞానంతో జీవాల పెంపకాన్ని చేపట్టి ఆర్థికంగా వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, డీఈ ప్రొఫెసర్ శోభామణి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలసుబ్రమణ్యం, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సుజాత, శాస్త్రవేత్త డాక్టర్ జి.గంగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.మంజరి, ఏర్పేడు, పల్లాం మండలాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

మతోన్మాదంపై పోరాడండి

● పీడీఎస్ఓ సంచిక ఆవిష్కరణలో వక్తలు



ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మతోన్మాదం అత్యంత ప్రమాదకరమైందని, దానిపై విద్యార్థులు కలిసికట్టుగా పోరాడాలని కార్మిక నాయకులు మీరయ్య, ఎస్వీయూ ఆచార్యులు డాక్టర్ డి.గోవిందులు పిలుపునిచ్చారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమం, పాలస్తీనా ప్రజల పోరాటాన్ని వివరిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) రూపొందించిన ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం స్థానిక ఎమరాల్డ్స్ కళాశాలలో జరిగింది. పీడీఎస్ఓ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.ఉష అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ 78 సంవత్సరాలుగా ఇజ్రాయిల్ పాలస్తీనాపై మారహోమం సాగిస్తోందన్నారు. 45 వేల మందికిపైగా పాలస్తీనా ప్రజలు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాలను కళ్లకు కట్టినట్టు వివరించేలా రూపొందించిన ప్రత్యేక సంచికను విద్యార్థులందరితో చదివించాలని సూచించారు. మనదేశంలోనూ మతోన్మాద శక్తులు వేళ్లూనుకుంటున్నాయని, వాటిని అడ్డుకోకపోతే అధోగతిపాలవ్వాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్ఓ జిల్లా కన్వీనర్ స్రవంతి, కో కన్వీనర్ స్రవంతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా కోరితే రాదు : జనసేన



మీడియాతో మాట్లాడుతున్న హరిప్రసాద్

తిరుపతి (లీలామహల్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కోరితే రాదని, ప్రజాతీర్పు ద్వారా పొందాలనే విషయాన్ని వైసీపీ వారు గ్రహించాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి విమర్శించారు. గవర్నర్ ప్రసంగాన్ని కూడా వినకుండా ప్రతిపక్ష హోదా కావాలని వైసీపీ గోల చేయడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వ ఏర్పాటులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాత్రపై దేశం మొత్తం అభినందిస్తుంటే ప్రతినెలా రూ.50 కోట్లు తీసుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆరోపించడం సిగ్గుచేటన్నారు. మా నాయకుడికి డబ్బే కావాలనుకుంటే సినిమాలు చేసేవారని, ప్రజాసేవ చేయడానికి వచ్చి ప్రజల మనస్సులో నిలిచారని పేర్కొన్నారు. వైసీపీ నేతల్లా తమ నాయకుడికి దోచుకోవడం, దాచుకోవడం తెలియదన్నారు. దువ్వాడ నోరు అదుపులో పెట్టుకోకపోతే ప్రజాగ్రహం కళ్ల చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రాజేష్ ఆచారి, వినోద్‌రాయల్, హేమకుమార్, మునస్వామి, కిషోర్, శేషాద్రి రాయల్, ఆది, రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ లేకుండా ప్రయాణం చేయకండి

తిరుపతి(సెంట్రల్), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టికెట్ లేకుండా ప్రయాణం చేయరాదని గుంతకల్లు డివిజన్ కమర్షియల్ విభాగం ఏసీఎం ధనంజయ కుమార్ సింగ్ ప్రయాణికులకు సూచించారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో గురువారం ఆయన పలు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. పాకాల నుంచి తిరుపతి, రేణిగుంట మీదుగా శ్రీకాళహస్తి వరకు, రేణిగుంట నుంచి కడప వరకు తనిఖీలు నిర్వహించారు. టికెట్ లేని ప్రయాణికులను గుర్తించి, అపరాధ రుసుం వసూలు చేశారు. సుమారు 700 కేసులు నమోదు చేసి, రూ.3.70 లక్షలు వసూలు చేశారు. టికెట్ లేని ప్రయాణం నేరమని సూచించారు. కార్యక్రమంలో సీటీటీఐ జనరల్ ఎస్‌వీ రావు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష



విమానాశ్రయంలో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం విమానాశ్రయంలో అధికారులతో సమీక్షించారు. మార్చి ఒకటో తేదీన చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొననున్నారు. చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలసత్వం చూపకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి



మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నగరంలో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా రవాణా శాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో గురువారం ఆటోల యజమానులతో ఆయన సమావేశమయ్యారు. కాలుష్యాన్ని తగ్గించేలా సీఎన్‌జీ, బ్యాటరీల ద్వారా ఆటోలు నడపాలని కోరారు. ఫిట్‌నెస్, పర్మిట్లను వెంటనే పునరుద్ధరించుకోవాలని సూచించారు. ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రటరీ శివ, మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, అతికానాజ్, స్వర్ణలత, ఏవో విజయ ప్రశాంతి పాల్గొన్నారు.

■ నేడు నేషనల్ సైన్స్ డే

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తిని కలిగించి... పరిశోధనాత్మక జ్ఞానాన్ని పెంపొందించి... వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఇన్‌స్పైర్ అవార్డ్స్ - మనక్ ప్రదర్శనా పోటీలను నిర్వహిస్తోంది. తాజాగా మన జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలకు ఎంపికైన పరిశోధనా విశేషాలు...

- తిరుపతి (విద్య), ఆంధ్రజ్యోతి

మన బుల్లి శాస్త్రవేత్తలు



జపాన్‌ను మెప్పించిన బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్



ఉడికిన తర్వాత కోడిగుడ్డు పెంకును తొలగించేందుకు అవస్థలు పడుతుంటాం. దీనికో సులభ యంత్రం కనిపెట్టింది రేణిగుంట మండలం, గుత్తివారిపల్లె జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని గొల్లపల్లి రేష్మ. గుండ్రంగా తిరుగుతున్న బౌల్‌లోకి ఉడికించిన గుడ్లు వేయగానే పెంకులు ఒకవైపునకు, కోడిగుడ్లు మరో వైపునకు చేరతాయి. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండేవారి పనిని ఇది తేలిక చేస్తుంది. హోటళ్లు, ఆస్పత్రుల్లో ఈ పరికరం చాలా ఉపయుక్తంగా ఉంటుంది. టీచర్ పి. మునిరెడ్డి మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందించారు. బాయిల్డ్ ఎగ్ షెల్ పీలర్ ప్రాజెక్ట్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని, అక్కడ కూడా ఉత్తమ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. ఆ తర్వాత జపాన్‌లో జరిగిన అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్ట్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శితమైంది.

టెంకాయలు కొట్టే యంత్రం

టెంకాయలకు తేలికగా రంధ్రాలు వేయడం, ఎంతగట్టిగా ఉన్న సులభంగా పగులగొట్టడం.. ఈ పరికరం చేస్తుంది. రామచంద్రాపురం మండలం, కమ్మపల్లి జీహెచ్ఎస్ విద్యార్థిని ఎం. వాణి రూపొందించిన యంత్రం ఇది. టీచర్ ఎస్‌జే కామేశ్వరి సహకారంతో ఈ ప్రాజెక్ట్‌ను తయారు చేశారు.



చెత్త శుభ్రతకు యంత్రం

కాలువల్లోని చెత్తాచెదారాలను సులభంగా శుభ్రం చేసేందుకు తయారు చేసిన యంత్రం ఇది. నగరాల్లో డ్రైనేజీ కాలువలు శుభ్రంచేసే పనివారికి చాలా ఉపయోగపడుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ పనిని చేసేందుకు దోహద పడుతుంది. దొరవారిసత్రం మండలం, కల్లూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వి. నిరూష దీనిని రూపొందించారు. ఇది జాతీయస్థాయి ప్రదర్శనలో ప్రశంసలు అందుకుంది. టీచర్ పీవీ రమణయ్య మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టును రూపొందించారు.



పుత్తూరు వార్తలు

పొంచి ఉన్న ముప్పు

- పుత్తూరు ప్రజలను వెంటాడుతున్న తాగునీటి ఇబ్బందులు
- ప్రైవేటు బోర్లను ఆశ్రయిస్తున్న మున్సిపల్ అధికారులు
- నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం
- బకాయిల వసూలు లేనట్టేనా?

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో వేసవి ప్రారంభం కాకముందే పుత్తూరు పట్టణంలో తాగునీటి కొరత ఏర్పడింది. ప్రస్తుతం ఉన్న బోర్ల నుంచి వచ్చే నీరు సరిపోవడం లేదని భావించి ముందస్తుగా చర్యలు చేపట్టేందుకు మున్సిపల్ అధికారులు సిద్ధమయ్యారు. సమీపంలోని ప్రైవేటు బోర్ల యజమానులను ఆశ్రయిస్తున్నారు. మూలకోన నుంచి గోవిందపాళెం సంపునకు సరఫరా అయ్యే పైప్‌లైన్ మరమ్మతులకు గురైందని, ప్రత్యామ్నాయంగా ప్రైవేటు బోరుకు అద్దె చెల్లించేందుకు సిద్ధమయ్యారు. అందుకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెలకు రూ.63 వేలు చెల్లించనున్నారు. అంతేకాకుండా 13వ వార్డు నందిమంగళం పరిధిలోని బోరులో మురుగు వస్తుండటంతో దాన్ని శాశ్వతంగా మూసేశారు. సమీపంలోని రైతు బోరును వినియోగించుకునేందుకు కూడా రూ.63 వేలు అద్దె చెల్లించనున్నారు. ఈ ప్రతిపాదనలు శుక్రవారం జరిగే మున్సిపల్ కౌన్సిల్ ఆమోదానికి ఉంచనున్నారు. టెండర్లు పూర్తి చేసుకున్న దాదాపు రూ.76.33 లక్షల సివిల్ వర్కులను ఆమోదించనున్నారు. అంతే కాకుండా పాత తహసీల్దార్ కార్యాలయంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న సచివాలయాన్ని మార్చు చేయాలని, తమ రికార్డులు భద్రపరుచుకోవాలని రెవెన్యూ అధికారులు కోరారు. ప్రత్యామ్నాయ చర్యలను మున్సిపల్ అధికారులు చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న కూడలిలో హైమాస్ట్ లైట్ ఏర్పాటుకు రూ.5 లక్షలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే పట్టణ పరిధిలోని ఎక్స్‌టెన్షన్ ప్రాంతాల్లో వీధిలైట్ల ఏర్పాటుకు, నిర్వహణకు రూ.30 లక్షలకు ప్రతిపాదన చేశారు. పట్టణంలోని 47 బోర్ల నిర్వహణ చూసే ఆపరేటర్లకు గౌరవ భృతిని రూ.1000 చొప్పున అందజేస్తున్నారు. ఈ భృతిని ఏడాదికి అందించేందుకు రూ.5.64 లక్షలు కేటాయించనున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో పట్టణ పరిధిలోని అనధికార లేఅవుట్ల విషయంలో చర్యలు తీసుకుంటామన్న మున్సిపల్ కౌన్సిల్ ఆ మేరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. 14 అనధికార లేఅవుట్లు ఉన్నాయని, వాటిల్లో కొనుగోలు చేసిన ప్లాట్లకు ఎటువంటి అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఇటీవల వేలం నిర్వహించిన దినసరి మార్కెట్, ప్రైవేటు బస్టాండ్, జంతువధ శాల గుత్త వసూలు ప్రక్రియను ఆమోదించనున్నారు. కాగా, గత బకాయిల విషయాన్ని అజెండాలో పొందపరచలేదు.

మద్యం దుకాణం వద్దు

రాచపాళెం వద్ద గ్రామస్తుల ధర్నా

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): తమ గ్రామం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని రాచపాళెంవాసులు కోరుతున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి పుత్తూరు కట్లు కట్టుకోవడం కోసం వస్తుంటారని, ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఇబ్బందికర పరిస్థితుల తలెత్తుతాయన్నారు. గతంలో ఇక్కడ మద్యం దుకాణం ఉండేదని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగేవన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దుకాణాన్ని వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరారు.

అంతర్ కళాశాల క్రీడల్లో కేకేసీ హోమియోపతి విద్యార్థుల ప్రతిభ



పుత్తూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హోమియోపతి వైద్య అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో కేకేసీ విద్యార్థులు మూడు పతకాలను సాధించారు. ఇటీవల ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో హోమియో మెడికల్ కళాశాల విద్యార్థులకు తాడేపల్లిలో క్రీడాపోటీలను నిర్వహించారు. కేకేసీ విద్యార్థి సైఫుల్లా 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, 100 మీటర్లు, లాంగ్ జంప్‌లో రెండోస్థానంలో నిలిచాడు. రిలే పరుగు పందెంలో ప్రదీప్, సందీప్, నవీన్, సైఫుల్లా బృందం ప్రథమ స్థానంలో నిలిచింది. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల నిర్వాహకులు అభినందించారు. ప్రిన్సిపాల్ శరవణన్, కళాశాల వైస్‌చైర్మన్లు నరసింహారావు, రవిశేఖర్, అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ నాన నాయక్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఎన్టీఆర్ రక్తదాన ట్రస్ట్ సహకారంతో పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం కేకేసీ కళాశాలలో జరగనుంది. ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వదించారు. అనంతరం ఆయన ప్రత్యేక అర్చనలు, పూజల్లో పాల్గొన్నారు. ధనపాల్, రవిశేఖర్ రాజు, నారాయణబాబు, బి.సుబ్రమణ్యం, నబీ, ఐటీసీ రఫి తదితరులు పాల్గొన్నారు.

● పుత్తూరు తాలూకా విశ్రాంత ఉద్యోగ సంఘ అధ్యక్షుడు భాస్కర్ రాజు సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. రెండు రోజుల క్రితం భాస్కర్‌రాజు మృతి చెందిన విషయం విదితమే. ఈక్రమంలో భాస్కర్‌రాజు నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రీ సర్వే తప్పులను సరిచేయండి

పెళ్లకూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీలపాటూరులో గతంలో జరిగిన రీ సర్వేకు సంబంధించిన రికార్డులు తప్పులతడకల ఉన్నాయని, వాటిని సరిచేయాలని రైతులు గురువారం తహసీల్దార్ ద్వారకనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్లకు మునుపు ప్రభుత్వం నుంచి పొంది ఫ్రీహోల్డ్‌కు అర్హత సాధించిన భూములు కలెక్టర్ ప్రొసెడింగ్‌లో ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో వివరాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు భూములకు సంబంధించిన సర్వే నంబర్లు గల్లంతవడంతో పాటు ఒకరికి సంబంధించిన ఎల్‌పీఎం నంబర్లు మరొకరి పేరున ఉన్నామని చెప్పారు. రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ప్రయాణికుల నిరీక్షణకు నీడ కరువు

శిథిలావస్థలో బస్ షెల్టర్

కోట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో ప్రయాణికుల నిరీక్షణకు నీడ కరువైంది. విద్యానగర్ నుంచి నాయుడుపేట, తిరుపతి, గూడూరు, నెల్లూరు పట్టణాలకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాకుండా ఈ ప్రాంతంలో ఉన్న విద్యాసంస్థల్లో చదువుకునేందుకు రోజూ వందలాది మంది విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల సౌజన్యంతో మూడు దశబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బస్ షెల్టర్ శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ప్రయాణికులు వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండ, వానతో నానా అవస్థలు పడాల్సి వస్తోందని విద్యార్థులు, ప్రయాణికులు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యానగర్‌లో బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



విద్యానగర్‌లో శిథిలావస్థలో ఉన్న బస్ షెల్టర్

మున్సిపాలిటీల అభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకం

నాయుడుపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం అందించే నిధులతో పాటు వంద శాతం పన్నుల వసూళ్లు చేయాలని మున్సిపల్ శాఖ రీజినల్ డైరెక్టర్ సూర్యదేవర హరికృష్ణ అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సచివాలయ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50శాతం కన్నా తక్కువగా పన్నులు వసూలు చేసిన మున్సిపల్, సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తామన్నారు. మున్సిపాలిటీలో రూ.6 కోట్ల పన్నుల డిమాండు ఉండగా ఇప్పటివరకు రూ.3.5 కోట్లు మాత్రమే వసూలయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువులోగా వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. సమావే శంలో మున్సిపల్ కమిషనరు ఫజులుల్లా పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఎం హరికృష్ణ

రథోత్సవం... భక్తజనసంద్రం











రథోత్సవం సందర్భంగా శివనామ స్మరణతో చతుర్మాడ వీధులు మార్మోగాయి. పట్టణవాసులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు ఈ వేడుకను తిలకించేందుకు తరలిరావడంతో ఉదయం 9 గంటల నుంచే తేరువీధి, నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, ఈవో బాపిరెడ్డి కొబ్బరికాయలు కొట్టి జెండా ఊపి రథ యాత్రను ప్రారంభించారు. రథం ముందు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



తెప్పోత్సవానికి బయలు దేరిన స్వామిఅమ్మవార్లు





తెప్పోత్సవంలో స్వల్ప తొక్కిసలాట

ఆలయ సెక్యూరిటీగార్డు సహా వృద్ధురాలికి గాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తెప్పోత్సవం సందర్భంగా నారద పుష్కరిణి వద్ద భక్తుల మధ్య తొక్కిసలాట చోటు చేసుకుంది. అయితే వెనువెంటనే అందరూ అప్రమత్తం కావడంతో పెనుప్రమాదం తప్పింది. తెప్పోత్సవం జరిగే నారదపుష్కరణి పరిసరాల్లో ఎలాంటి వాహనాలను అనుమతించమని అధికారులు ప్రకటించారు. ఆలయం నుంచి నారదపుష్కరణికి స్వామి అమ్మవార్లు విచ్చేస్తున్న సమయంలో కొందరు రాజకీయ నేతల కార్లను పుష్కరణి వద్దకు అనుమతించారు. అలాగే కోనేరు పక్కనే వైఎస్ఆర్ కూడలివద్ద బందోబస్తు నిర్వహించే కొందరుపోలీసు అధికారులు తమకు అయిన వారిని, తెలిసిన కోనేరులోకి పంపుకోవడంలో నిమగ్నమయ్యారు. కోనేరు పక్కనే ఉన్న వైఎస్ఆర్ కూడలి వద్దకు స్వామి అమ్మవార్లు ఊరేగింపుగా వచ్చిన సమయంలో భక్తులు దూసుకువచ్చారు. దీంతో తోపులాట జరిగి కొందరు భక్తులు కింద పడ్డారు. అక్కడ విధుల్లో ఉన్న మురళి అనే ముక్కంటి ఆలయ సెక్యూరిటీగార్డు, పక్కనే ఉన్న వృద్ధురాలు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

అస్వస్థతకు గురైన ఎస్ఐ

తెప్పోత్సవంలో ఎస్ఐఅస్వస్థతకు గురయ్యాడు. అనంతపురం కమాండ్ కంట్రోల్ విభాగంలో ఎస్ఐగా పనిచేసే భాస్కర్ నారద పుష్కరణిలో తెప్పోత్సవం సందర్భంగా విధుల్లో ఉండగా షుగర్ లెవల్స్ తగ్గిపోవడంతో సొమ్మసిల్లిపోయారు. అక్కడే ప్రభుత్వ మెడికల్ క్యాంప్ సిబ్బంది వైద్య అందించడంతో కోలుకున్నారు.

బాణసంచాతో ఇక్కట్లు

తెప్పోత్సవంలో బాణసంచా కాల్చడంతో భక్తులకు ఇబ్బదికర వాతావరణం నెలకొంది. నారదపుష్కరణి తూర్పున ఉన్న నిర్మాణంలో భవనం పై నుంచి స్వామి అమ్మవార్లుతెప్పోత్సవంలో విహరించే సందర్భంగా బాణసంచా కాల్చారు. పైకివెళ్లిన కాలిన టపాకాయాలు నుంచి నిప్పురవ్వలు, వ్యర్థాలు కోనేరులో బైఠాయించిన భక్తులపై రాలుతుండగంతో కొంత అసౌకర్యం కలిగింది.



స్వల్పంగా గాయపడిన సెక్యూరిటీగార్డు మురళి, వృద్ధురాలు

ఎమ్మెల్యే పేరును మరచి..

ముక్కంటి ఆలయ ఉద్యోగి విజయసారథి తెప్పోత్సవంలో మైకు చేతబట్టి యాంకర్‌గా వ్యవహరించారు. అతిథులను, ఉభయదారులను తెప్పలపైకి ఆహ్వానించడంతో పాటు మైకులో భక్తులకు సూచనలు చేస్తూ ఆయన తెప్పలపై నుంచి మాట్లాడారు. ఈ సమయంలో స్వామివారి తెప్పపైకి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దంపతులకు మైకు ద్వారా ఆహ్వానించే క్రమంలో అలవాటులో పొరబాటుగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పేరును ఉచ్చరించారు. వెంటనే పొరబాటును సరిదిద్దుకుంటూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిపేరును పలుకుతూ తెప్పలపైకి ఆహ్వానించారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం



వరదయ్యపాళెం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వరదయ్యపాళెంలోని త్రయంబకేశ్వరాలయం, పాండూరులోని జ్యోతీశ్వరాలయం, సంతవేలూరులోని వాలీశ్వరాయలాల్లో గురువారం ఉదయం లింగోద్భవ అభిషేకాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆది దంపతులనుఅలంకరించి వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వరదయ్య పాళెంలో ఎంపీపీ పద్మప్రియ, దామోదర్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

హంస వాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీకాహహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండమానుపురంలో ప్రసన్న అభయహస్త వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో గురువారం ఉదయం వేకువజామున స్వామిఅమ్మవార్లను అర్చకులు సుప్రభాత సేవతో మేల్కొపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అభిషేక పూజలు చేశారు. 11గంటలకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5.30గంటలకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి సర్వాలంకార శోభితు లైన స్వామిఅమ్మవార్లు హంసవాహనంపై ఆశీనులై గ్రామవీధుల్లో ఊరేగారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఊంజల్ సేవ

ఎంపీడీవో కార్యాలయ మరమ్మతుల పరిశీలన

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు ఎంపీడీవో కార్యాలయం మరమ్మతులను పీఆర్ డీఈ పరిశీలించారు. ఎంపీడీవో కార్యాలయ మరమ్మతులు రూ.20లక్షలు జడ్పీ నిధులతో చేపడుతున్నారు. వాటిని డీఈ వెంకట వినోద్‌రెడ్డి పరిశీలించారు. 40 ఏళ్ల కిందట నిర్మించిన భవనం కావడంతో ఈ పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, చిత్తూరు జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్ నాయుడు, పీఆర్ ఇన్‌చార్జి ఏఈ రవితేజ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాధిక్ పాల్గొన్నారు.

వినియోగంలోకి అంబులెన్స్

సత్యవేడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వాస్పత్రిలో మరమ్మతులకు గురై మూలకు చేరిన అంబులెన్స్ టీడీపీ నాయకుడు చొరవతో వినియోగంలోకి వచ్చింది. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స కోసం తిరుపతి, చెన్నైలకు తరలించేందుకు రెండేళ్ల క్రితం శ్రీసిటీలోని ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ పరిశ్రమ అధునాతన సౌకర్యాలతో అంబులెన్స్‌ను వితరణగా అందించింది. ఈ అంబులెన్స్ ద్వారా అతి తక్కువ ఖర్చుతో రోగులకు ఇతర ప్రాంతాలకు తరలించేవాళ్ళు. అనంతరం అంబులెన్స్‌కు పర్యవేక్షణ కొరవడడంతో మరమ్మతులకు గురై ంది. అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పలుమార్లు ప్రజా ప్రతినిధులు కోరారు. దీంతో స్పందించిన సత్యవేడు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్ స్పందించి తన సొంత నిధులు రూ.1.5 లక్షలతో మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారు. అంబులెన్స్‌ను గురువారం ఆస్పత్రి ఆవరణలో స్థానిక టీడీపీ నాయకలతో కలిసి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ సురేష్‌కు అందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ మెంబర్ శోభ, నాయకులు శివయ్యశెట్టి, పృథ్వీ శివానంద, ఆది తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దే పింఛన్ అందించాలి

పిచ్చాటూరు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా మండలంలో పింఛన్‌దారులకు ఇంటి వద్దే పెన్షన్ అందించాలని ఎంపీడీవో మహ్మద్‌రఫి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఇంటి వద్దే పింఛను తీసుకోవాలన్నారు. ఒక వేళ ఇంటి వద్ద అందుబాటులో లేని పింఛన్‌దారులకు 300 మీటర్ల కంటే ఎక్కువ దూరంలో పింఛన్ పంపిణీ చేయదలచిన కారణాలు కూడా అధికారులు తమ మొబైల్ యాప్‌లో పొందుపరచాల్సి ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో కొత్తబైపాసు రోడ్డు షటిల్‌కోర్టు వద్ద జరిగింది. తొట్టంబేడు మండలం సాంబయ్యపాళేనికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటరమణారెడ్డి వ్యవసాయ పనులు చేస్తుంటారు. శ్రీకాళహస్తి పట్టణం చెన్నై రోడ్డు సాయిబాబా ఆలయ సమీపంలో వీరి బంధువు గురువారం మృతి చెందారు. మృతదేహానికి నివాళులర్పించేందుకు సుబ్రహ్మణ్యంరెడ్డి, వెంకటరమణారెడ్డి ద్విచక్రవాహనంపై వచ్చారు. తిరుగు ప్రయాణంలో షటిల్‌కోర్టు వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఈఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. సుబ్రహ్మణ్యంరెడ్డిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి, వెనుక కూర్చున్న వెంటకరమణారెడ్డి పట్టణ శివార్లలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు స్థానికులు తరలించారు. ఇరువురికి ప్రథమచికిత్స అనంతరం తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. రెండో పట్టణ పోలీసులు కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య


ఆనంద్ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో అత్తింటి వద్ద మనస్థాపం చెంది తొండు ఆనంద్(28) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరుకు చెందిన మానస, ఇదే మండలం వేడాం దళితవాడకు చెందిన ఆనంద్‌కు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరు శ్రీకాళహస్తి పట్టణంలోని ముక్కంటి ఆలయ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో పనిచేస్తుంటారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మూడు నెలల క్రితం మనస్థాపం చెందిన మానస పట్టణంలోని కనకదుర్గమ్మ కొండ మెట్ల ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై కేసు నమోదు కావడంతో ఆనంద్‌ను 1వ పట్టణ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇటీవల వారంరోజుల క్రితం ఆనంద్ బెయిల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ ఇరుకుటుంబాల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. ఈ నెల 24వ తేదీన కమ్మకొత్తూరులోని అత్తింటి వద్దకు వెళ్లిన ఆనంద్ మాటామాటా పెరగడంతో విషం తాగాడు. గమనించిన కుటుంబీకులు తిరుపతి రుయాలో చేర్పించగా చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి: మరొకరికి గాయాలు


ఏసు (ఫైల్‌ఫొటో)

నారాయణవనం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని వేదనారాయణ కళాశాల వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు... నారాయణవనం మండలం కశింమిట్టకు చెందిన నారయ్య కుమారుడు కే.ఏసు(57), భీమునిచెరువుకు చెందిన మురుగేశన్ ద్విచక్రవాహనంపై పుత్తూరు పట్టణానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో పుత్తూరు - ఊత్తుకోట బైపాస్‌రోడ్డు సమీపంలోని వేదనారాయణ కళాశాల వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఏసు అక్కడిక్కడే మృతి చెందగా, మురుగేశన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని పుత్తూరు వైద్యశాలకు తరలించారు.

ఇసుకగుంట వద్ద...


చారికేశ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతిచెందాడు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం ఇసుకగుంట సమీపంలోని ప్రైవేటు కర్మాగారం ఎదుట తిరుపతి - నాయుడుపేట జాతీయ రహదారిపై గురువారం జరిగింది. ఏర్పేడు మండలం మేర్లపాకకు చెందిన శరవణ ఐఐటీలో ఒప్పంద కార్మికుడు. ఆయన భార్య యశస్విని గృహిణి. వీరికి నాలుగేళ్ల చారికేశ అనే కుమారుడు ఉన్నాడు. యశస్విని సోదరుడు కిరణ్ శ్రీకాళహస్తి పట్టణంలోని బీపీ అగ్రహారంలో నివసిస్తుంటాడు. ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు గురువారం కిరణ్ తన సోదరి యశస్వినితో పాటు ఆమె కుమారుడు చారికేశను వెంటబెట్టుకుని మేర్లపాక నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గమధ్యంలో ఇసుకగుంట వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో చారికేశ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే చిన్నారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నారు.

సుజుకీ కార్ల షోరూంలో నగదు చోరీ

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): సుజుకీ కార్ల షోరూంలో బుధవారం అర్ధరాత్రి నగదు చోరీ జరిగింది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు... రేణిగుంట - తిరుచానూరు బైపాస్ రోడ్డులోని విష్ణు కార్స్ సుజుకీ కార్ల షోరూంను రాత్రి మూసివెళ్లారు. ఉదయం షోరూం తెరవగా గల్లా పెట్టిలోని లక్షరూపాయలు చోరీ అయినట్టు సిబ్బంది గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శ్రీవారి భక్తుడికి మద్యం తాగించి లూటీ

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం వచ్చిన తమిళనాడుకు చెందిన ఓ భక్తుడికి ఫూటుగా మద్యం తాగించి మత్తులో ఆటోడ్రైవర్, అతని స్నేహితులు లూటీ చేశారు. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు తమిళనాడుకు చెందిన దామోదరం శ్రీవారి దర్శనార్థం తిరుపతికి చేరుకుని శ్రీనివాసంలో దర్శనానికి టోకెన్ తీసుకుంటాడు. అనంతరం మద్యం తాగాలని శ్రీనివాస సమీపంలోని ఓ ఆటో డ్రైవర్ని కోరగా సమయం దాటిపోయిందన్నాడు. బ్లాక్‌లో తీసిస్తానని తెలపడంతో భక్తుడు నమ్మాడు. ఆటోల తిరుచానూరుకూ తీసుకెళ్లి అక్కడ మరో ముగ్గురు స్నేహితులను ఆటోలో ఎక్కించుకున్నాడు. గాజులమండ్యం పోలీసు స్టేషన్ పరిధిలోని తుడా రోడ్డుకు చేరుకుని నలుగురు కలిసి మద్యం తాగారు. దామోదర్ అధికంగా మద్యం తాగాడు. మత్తులో ఉన్న దామోదర్ నగదు, బంగారు చైను, సెల్ ఫోనుతో ఉడాయించారు. దీంతో ఉదయం మత్తు దిగడంతో తన నగదు, సెల్‌ఫోన్, బంగారు చైన్ చోరీ జరిగిందని గుర్తించి గురువారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: ఎనిమిది మందికి గాయాలు

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో ఎనిమిదిమంది గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం ఉదయం మర్రిగుంట వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు... వెంకటగిరికి చెందిన కుటుంబం శివరాత్రి సందర్భంగా మూలకోనలో రాత్రి నిద్ర చేసి ఉదయం వెంకటగిరికి వెళ్తుండగా రేణిగుంట నుంచి స్టీల్ లోడుతో వెళుతున్న లారీ ఢీనింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిదిమంది గాయపడ్డారు. అయితే ఆటో, లారీ డ్రైవర్ సర్దుబాటు చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

భర్త మద్యం అలవాటు మానలేదని భార్య ఆత్మహత్య


నవనీత మృతదేహం

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిస అయిన తన భర్తను ఎన్నిసార్లు అలవాటు మార్చుకోవాలని చెప్పినా వినక పోవడంతో జీవితంపై విరక్తి చెంది ఓ భార్య ఆత్మహత్య చేసుకుంది. ఏర్పేడు మండలం మర్రిమంద బీసీ కాలనీలో జరిగింది. ఏర్పేడు ఏఎస్ఐ హబీబ్ తెలిపిన వివరాలు... పాపానాయుడుపేట పంచాయతీ మర్రి మంద బీసీ కాలనీలో నివాసం ఉంటున్న రామ్మూర్తి మద్యానికి బానిసయ్యాడు. ఈ విషయంపై భార్య నవనీత(40) గొడవపడేది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చిన భర్తతో గొడవ పెట్టుకుని వెళ్లిపోయింది. గురువారం మధ్యాహ్నం 12.30గంటలకు వికృతమాల చెరువులో మృతదేహం తేలుతుండడంతో గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి నవనీతదిగా గుర్తించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పల్లికొండేశ్వరుడి కల్యాణం... ముల్లోకాల్లో సంబరం

వధువుగా సర్వమంగళాదేవి ● వరుడిగా వాల్మీకేశ్వరుడు ● కల్పవృక్ష వాహనంపె వధూవరుల చిద్విలాసం



:కల్పవృక్ష వాహనంపై స్వామిఅమ్మవార్లు - మాంగళ్యాన్ని చూపుతున్న ఆలయ అర్చకుడు

నాగలాపురం, ఫిబ్రవరి 27, (ఆంధ్రజ్యోతి): పల్లికొండేశ్వరుడి కల్యాణోత్సవంతో ముల్లోకం సంబర పడింది. వధూవరులైన పార్వతీ పరమేశ్వరులు సుందరంగా దర్శనమిస్తూ భక్తులను కటాక్షించారు. సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గురువారం సాయంత్రం ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేశన్ గురుకుల్ ఆలయంలోని పరివార దేవతలకు అభిషేకాది కార్యక్ర మాలు చేపట్టారు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో ఆలయ ఆవరణలోని యాగ శాల మండపంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వధువుగా సర్వమంగళాదేవిని, వరుడిగా వాల్మీకేశ్వరస్వామిని ఆలయ ప్రదోష మండపంలో ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక పైకి వేంచేపు చేసి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం, పన్నీరులతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో, బంగారు ఆభరణాలతో, పట్టువస్త్రాలతో అలంకరించారు. దీపా రాధన అనంతరం స్వామిఅమ్మవార్ల ఎదుట హోమగుండాన్ని ఏర్పాటు చేసి శాస్త్రోకంగా పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ మాంగళ్యధారణ క్రతువు పూర్తి చేశారు.

కల్పవక్ష వాహనంపై చిద్విలాసం ... కల్యాణోత్సవం అనంతరం సర్వమంగళాదేవి సమేత వాల్మీకేశ్వరస్వామి కల్పవృక్ష వాహనంపై అధిష్ఠింపజేసి మంగళ వాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నడుమ అత్యంత వైభవంగా తిరువీధి ఉత్సవం నిర్వహించారు.

ఏప్రిల్ 20న 6వ తరగతి ప్రవేశపరీక్ష

కేవీబీపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 20న ఉదయం 10 నుంచి 12గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. అందుకు సంబంధించి ఎస్సీ ఎస్టీలు రూ.75, బీసీ, ఓసీలు రూ.150 ప్రవేశ పరీక్షకు రుసుం చెల్లించాలన్నారు. విద్యార్థులు మండలవాసులై ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి చదివిన వారు అర్హులన్నారు.

క్యాన్సర్ ఉచిత నిర్ధరణ పరీక్షలు


మహిళలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

కేవీబీపురం, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోవనూరు పీహెచ్‌సీ పరిధిలో గుంటిపేడు, కండ్లూరు గ్రామాల్లో స్విమ్స్ ఆధ్వర్యంలో గురువారం క్యాన్సర్ ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారి జగదీష్, సిమ్స్ వైద్యులు హరిత, పద్మావతి, స్వాతి, మాధవి, ఏఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది, సర్పంచ్ మురళి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శివరాత్రి అన్నదాన సంతర్పణ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కనమనంబేడు, నీర్పాకోటదాసు కాలనీలో పెద్ద ఎత్తున గురువారం అన్నదానం జరిగింది. కనమనంబేడు వినాయక ఆలయంలో వినాయకుడుకి అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు బోనస్ ఇవ్వాలి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా బోనస్ ఇవ్వాలని భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు కత్తి రవి కోరారు. ఉత్సవాలను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు వస్తుంటారని ఈ సందర్భంగా శ్రీకాళహస్తిని అత్యంత సుందరంగా పారిశుధ్య కార్మికులు తీర్చి దిద్దుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారి కష్టాలను ఆలయ అధికారులు గుర్తించి బోనస్ ఇవ్వాలన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


కళాకారుల నృత్య ప్రదర్శనలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ధూర్జటి కళా ప్రాంగణంలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం 4గంలకు పట్టణానికి చెందిన రూపేష్ భక్తిరంజనితో కార్యక్రమాలు మొదలయ్యాయి. 4.30 గంటలకు తిరుపతి పద్మకళ క్షేత్రానికి చెందిన శ్రీదేవి, 5 గంటలకు పట్టణానికి చెందిన శ్రీవిద్య, 6గంటలకు పూర్విక, 6.30గంటలకు చిత్తూరుకు చెందిన వనజాక్షి, రాత్రి 7గంటలకు చిత్రా మురళీధరన్ నృత్య ప్రదర్శనలు జరిగాయి. 8గంటలకు మల్కాజ్‌గిరికి చెరందిన జ్యోతిర్మయి భక్తి సంకీర్తనలు భక్తులను మైమరిపింపజేశాయి. 9 గంటలకు వెదురుకుప్పానికి చెందిన వీకే రత్నప్ప శాక్సాఫోన్ ప్రదర్శన, 10గంటలకు విజయవాడకు చెందిన సత్యవాణి కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. చివరిగా గుంటూరు జిల్లా వినాయక నాట్యమండలికి చెందిన యేపూరి వెంకటరావు రామాంజనేయ యుద్ధం నాటకంతో గురువారం నాటి సాంస్కృతిక ప్రదర్శనలు ముగిశాయి.

నాసికతో సాయిహేమంత్ వేణుగానామృతం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన సాయిహేమంత్ కృష్ణ నాసికంతో చేసిన వేణుగానామృతం భక్తులను మైమరపించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా, సీఎం చంద్రబాబు నుంచి సాయిహేమంత్ కృష్ణ ప్రశంసలు అందుకున్నారు. చాగంటి కోటేశ్వరరావు ఆయనకు నాసిక బ్రహ్మ బిరుదు కూడా ఇచ్చారు. అనంతరం సాయిహేమంత్‌ను ఆలయ అధికారులు సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కోట చంద్రశేఖర్ ఆయన్ను సత్కరించారు.

రేపటి సీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష


విమానాశ్రయంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): రేపటి సీఎం పర్యటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మార్చి 1న చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంతో ముఖ్యమంత్రి పర్యటనలో చిన్నపాటి లోపాలకు తావివ్వరాదని అధికారులను ఆదేశించారు. మార్చి 1న ఉదయం విజయవాడ నుంచి విమానంలో బయల్దేరి 11.25 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారని, 11.35 గంటలకు హెలికాప్టర్‌లో బయల్దేరుతారన్నారు. మధ్యాహ్నం తిరిగి విమానాశ్రయానికి రానుండడంతో అధికారులు అలసత్వం చూపకుండా ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి పూజలతో కలకలం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం పక్కనే ఉన్న భక్త కన్నప్ప కొండపై అర్ధరాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తి నిమ్మకాయలతో పూజలు చేయడంపై కలకలం రేగింది. మహాశివరాత్రి రోజున బుధవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో ఈ ఘటన వెలుగు చూసింది. తమిళనాడు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి నిమ్మకాయలతో విచిత్రంగా కేకలు వేస్తూ పూజలు చేశాడు. గమనించిన కొందరు భక్తులు అభ్యంతరం తెలిపారు. అర్ధరాత్రి పూజలు జరుగుతున్న దృశ్యాలను వీడియోలుగా చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విడుదల చేయడంతో వైరల్‌గా మారాయి.

బాల్యవివాహాలను నిర్మూలిద్దాం


పోస్టర్ల ఆవిష్కరణలో జనసేన నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలిద్దామని జనసేన నాయకుడు కొట్టేసాయి పిలుపునిచ్చారు. పట్టణం లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోస్టర్లను ఆవిష్కరించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించినా, చేసిన శిక్షార్హులని తెలిపారు. ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య, జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్, జనసేన నాయకులు కుమార్, మాధవ మహేష్, చిరంజీవి, బద్రి, రాఘవ, నీలాధర్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణపై మహిళా పోలీసులు మండలంలోని లక్ష్మీపురం, కాంపాళెం గిరిజన కాలనీ, బీఎన్‌కండ్రిగల్లో గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మి మాట్లాడుతూ... అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ శారద, యల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



లింగోద్భవ ఏర్పాట్ల పరిశీలన



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పురస్కరించుకుని గురువారం వేకువ జామున లింగోద్భవ దర్శనం జరిగింది. ఇందులో భాగంగా అంతకు ముందు తిరుపతి జిల్లా ఎస్పీ ఏర్పాట్లను పరిశీలించారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. క్యూలైన్లను తనిఖీ చేసి అధికారులను అప్రమత్తం చేశారు. అనంతరం రథోత్సవం, కల్యాణోత్సవానికి తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై చర్చించారు. అధికారులు, సిబ్బంది రెండు రోజులపాటు ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ట్రైనీ ఎస్పీ హేమంత్, అదనపు ఎస్పీల రవి మనోహరాచారి, రామకృష్ణ, డీఎస్పీలు నరసింహామూర్తి, రామకృష్ణ, చెంచుబాబు, విజయశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శివరాత్రి నిత్య ఉత్సవాల వివరాలు...

- ఉదయం 4:30 గంటలకు, మంగళ వాయిద్యాలు
- ఉదయం 5.00: గోపూజ, సర్వదర్శనం
- ఉదయం 6.00: ప్రథమ కాల అభిషేకం
- ఉదయం 7.00: ద్వితీయ కాల అభిషేకం
- ఉదయం 9.00: పరివార దేవాలయాల నైవేద్యం
- ఉదయం 10.00: స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- ఉదయం 10:30: గంటలకు ఉచ్చికాల అభిషేకం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోష కాలాభిషేకం
- రాత్రి 8.00: స్వామి, అమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- అర్ధరాత్రి పైన వేకువ జామున 3:30కి స్వామిఅమ్మవార్ల కల్యాణ మహోత్సవం
- ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు రాహుకేతు సర్వదోష నివారణ పూజలు